తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు: మాధవీలత


సమావేశంలో మాట్లాడుతున్న మాధవీలత

చార్మినార్: రిజర్వేషన్లు ఎత్తేస్తుందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకే కాకుండా ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు కూడా 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత ప్రధాని మోదీదేనని హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత అన్నారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఐఎస్సదన్‌లో జరిగిన బీజేపీ ఓబీసీ మోర్చా సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రిజర్వేషన్లపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎండకట్టారు. జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించిన మోదీ 27 మంది ఓబీసీలకే కేంద్ర మంత్రి మండలిలో మంత్రులుగా అవకాశాలు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్, కార్యదర్శి మోకాళ్ల వెంకటేష్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ ప్యారసాని వెంకటేష్, మోర్చా జిల్లా ఇన్‌చార్జి జమాల్‌పూర్ శేఖర్, కార్పొరేటర్లు ఆలె భాగ్యలక్ష్మి, శ్వేత మధుకర్ రెడ్డి, అరుణా రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘మజ్లిస్, బీజేపీలకు ఓటమి తప్పదు’


ఓటర్లకు చాయ్ పోస్తూ ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: మజ్లిస్, బీజేపీలకు ఓటమి తప్పదని హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మతం పేరు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ఈ రెండు పార్టీలను ప్రజలు చిత్తుగా ఓడిస్తారని ఆయన అన్నారు. శనివారం గోషామహల్ నియోజకవర్గంలోని జాంబాగ్, గోషామహల్, బేగంబజార్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..ఈ ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలంతా బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారన్నారు. తనను గెలిపిస్తే హైదరాబాద్ పార్లమెంట్ భారతదేశంలోని రోల్ మోడల్‌గా తయారు చేస్తానని గడ్డం శ్రీనివాస్‌యాదవ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ధన్‌రాజ్, పి.నరేందర్ యాదవ్, యోగి, యోగేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా మజ్లిస్ పార్టీ


గోల్కొండలో దివ్యాంగులతో ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: దివ్యాంగులకు మజ్లిస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటు వస్తుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన మజ్లిస్ పార్టీ హైదరాబాద్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ తరఫున గోల్కొండ, టోలిచౌకీ డివిజన్లలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్లిస్ దివ్యాంగుల గ్రేటర్ హైదరాబాద్ అసోసియేషన్ అధ్యక్షుడు జాహెద్ ఆలీ ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ దివ్యాంగులకు అండగా ఉంటూ వారు ఆత్మనిర్భరులై జీవనోపాధి కోసం కృషి చేసేలా ప్రోత్సహిస్తుందన్నారు. ఇందులో భాగంగానే సలార్ ఏ మిల్లర్ ఫౌండేషన్ తరఫున దివ్యాంగ యువతి, యువకులకు స్వయం ఉపాధి కోసం వివిధ రకాల పరికరాలు అందిస్తుందని తెలిపారు. అసదుద్దీన్ ఒవైసీని ఈసారి కూడా భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, వజీఉజ్‌జమా, షకీల్ ఆలీఖాన్ తదితరులున్నారు.

హైదరాబాద్ మజ్లిస్ కంచుకోట


అసదుద్దీన్ ఒవైసీతో పాటు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రాజేశ్వర్‌రావు

చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం మజ్లిస్ పార్టీకి కంచుకోట అని చార్మినార్ నియోజకవర్గం మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజేశ్వర్ రావు అన్నారు. శనివారం శాలిబండ, ఘాన్సీబజార్, పురానాపూల్ డివిజన్లలోని పలు బస్తీల్లో అసదుద్దీన్ ఒవైసీ పాదయాత్ర నిర్వహించి ఎన్నికల ప్రచారం చేశారు. ఎన్నికల ప్రచారంలో అసదుద్దీన్‌తో కలిసి పాల్గొన్న రాజేశ్వర్‌రావు ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి హైదరాబాద్ ఓటర్లు అసదుద్దీన్ ఒవైసీకి తప్పా ఇతర పార్టీల అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించలేదన్నారు. మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో రోడ్ల విస్తరణతో పాటు నిజాం కాలం నాటి పురాతన డ్రైనేజీ పైప్‌లైన్ పునరుద్ధరణ పనులు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి చర్యలు


జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

యాకుత్‌పురా: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి అన్నారు. పురానీహవేలీలోని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టులో శుక్రవారం రాత్రి నిర్వహించిన నూతన బార్ అసోసియేషన్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుకా యారా, సిటీ స్మాల్ కాసేస్ కోర్టు చీఫ్ జడ్జి నందికొండా నర్సింగ్‌రావు, తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్‌గౌడ్, అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసాచారి, ఉపాధ్యక్షులు ప్రవీణరెడ్డి, ప్రధాన కార్యదర్శి దుబ్బాకా హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శి బర్కా రాజేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మిడ్‌వైఫ్ దినోత్సవం


మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అబిడ్స్: ఫెర్నాండెజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని ఫెర్నాండెజ్ స్టార్ హోమ్, ఫెర్నాండెజ్ హాస్పిటల్ (బొగ్గులకుంట)లో శనివారం అంతర్జాతీయ మిడ్‌వైఫ్ (మంత్రసాని) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 2017 నుంచి తెలుగు రాష్ట్రాలకు మంత్రసాని సేవలను పరిచయం చేయడంలో అగ్రగామిగా ఉన్న ఫెర్నాండెజ్ ఫౌండేషన్ పోషణ్ జీవన వృద్ధి (టీ ఆఫ్ లైఫ్), అనుసంధానానికి ప్రతీకగా మిడ్‌వైఫ్ (మంత్రసాని)ల తత్వానికి ఈ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారికి ఫౌండేషన్ బృందం ప్రత్యేకంగా మిడ్‌వైఫరి ఓపెన్ హౌస్ చికిత్స అందించారు. ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్ మాట్లాడుతూ..ప్రతి గర్భిణి డెలివరీ సమయంలో తన సంరక్షణలో భాగంగా మంత్రసానిని అందించగలిగే ప్రపంచం కావాలని నేను కలలు కన్నా అన్నారు. ఈ కార్యక్రమంలో ఫెర్నాండెజ్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ తారకేశ్వరి, డైరెక్టర్ ఇందర్‌జిత్ కౌర్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో మజ్లిస్ గెలుపు ఖాయం




మహబూబ్ కాలనీలో ప్రచారంలో అక్బరుద్దీన్ ఒవైసీ తదితరులు

గోల్కొండ: హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి మజ్లిస్ అభ్యర్థి మరోసారి గెలవడం ఖాయమని ఆ పార్టీ శాసన సభ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. శనివారం కార్వాన్ డివిజన్‌లోని మహబూబ్ కాలనీలో జరిగిన మజ్లిస్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ, ఆ పార్టీ అగ్రనాయకులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాని నరేంద్రమోదీ కేంద్రమంత్రి అమిత్‌షా హైదరాబాద్‌కు వచ్చి నగర ప్రజల మధ్య విభేదాలు పుట్టించడానికి కుట్రలు పన్నుతున్నారన్నారు. హైదరాబాద్ నగరాన్ని మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని బీజేపీ చేస్తున్న ప్రచారంలో ఒక్క శాతం కూడా వాస్తవం లేదని ఆయన ఆరోపించారు. ఈనెల 13న జరిగే పోలింగ్‌లో మరోసారి అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఆయన వెంట కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ తదితరులున్నారు.

కార్వాన్‌లో మజ్లిస్ ప్రచార జోరు

- ప్రచారంలో దూసుకుపోతున్న మజ్లిస్ పార్టీ
- బీజేపీలో కానరాని ఎన్నికల హడావిడి
- పత్తాలేని బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు


గోల్కొండలో రోడ్‌షోలో అసదుద్దీన్ ఒవైసీ (ఫైల్)

గోల్కొండ: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని కార్వాన్ నియోజకవర్గంలో మజ్లిస్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతుంది. ప్రత్యర్థులకు అందని విధంగా మజ్లిస్ పార్టీ రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారం, కార్నర్ మీటింగ్‌లతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. ఆ పార్టీ అగ్ర నాయకుడు హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ ఇప్పటికే రోడ్ షోలు, బహిరంగ సభలు, ఇంటింటి ప్రచారంలో ఎనిమిది సార్లు పాల్గొన్నారు. మరోసారి ఆ పార్టీ శాసన సభ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ సైతం తనదైన శైలిలో మజ్లిస్ నాయకులను ఉత్తేజపరుస్తూ బహిరంగ సభలు, రోడ్ షోల్లో పాల్గొంటున్నారు. వీటన్నిటికీ తోడుగా కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ మజ్లిస్ నాయకులు, కార్యకర్తలతో ఉదయం నుంచి రాత్రి వరకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు.

తూతూ మంత్రంగా బీజేపీ..

బీజేపీ అభ్యర్థి అన్నితానై వ్యవహరిస్తున్నారు. కార్వాన్‌లో ఆమె ప్రచారానికి ఎప్పుడు వస్తున్నారో కొందరు బీజేపీ నాయకులకే తెలియకుండా ఉంటుంది. సీనియర్ నాయకులను పక్కనపెట్టారని పలువురు పార్టీ సీనియర్ నాయకులు వాపోతున్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి జెండా మోసిన వారికి పార్టీ అభ్యర్థి దర్శనమే గగనమైంది. ఏదేమైనా కార్వాన్‌లో బీజేపీ గట్టి పోటీ ఇస్తుందని అనుకున్న వారు డీలాపడ్డారు.

కానరాని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు..

పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి కడు దయనీయంగా మారింది. పార్టీ తరఫున రెండు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన నేతలు బీఆర్ఎస్‌కు రామ్‌రామ్ చెప్పేశారు. గుడిమల్కాపూర్ కార్పొరేటర్‌గా గతంలో ఎంపికైన ఓ మాజీ కార్పొరేటర్ పరిస్థితి సైతం అయోమయంగా మారింది. తాను పార్టీ మారుతున్నానంటూ ప్రకటనలు చెప్పుకున్నా కూడా ఆయనను ఏ పార్టీ వారు పట్టించుకోవడం లేదు. బీజేపీపై ఆశలు పెట్టుకున్న మాజీ కార్పొరేటర్ ఆ పార్టీ నాయకులు ఈయనను పలకరించకపోవడంతో ఆయన బీఆర్ఎస్‌లోనే ఉంటూనే సైలెంట్‌గా ఉన్నారు. ఇదిలా ఉండగా సుదీర్ఘ కాలం తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సైతం కార్వాన్ నియోజకవర్గంలో తన ఉనికి చాటుకోవడానికి పూర్తిగా విఫలమవుతుంది. ఏదేమైనా కార్వాన్ నియోజకవర్గంలో తమ పట్టును మరింత బిగించుకోవడంలో మజ్లిస్ తీవ్ర స్థాయిలో కృషి చేస్తుంది.

సన్మానం



చార్మినార్: నగరంలో 40 ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న తనకు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ డైరెక్టర్, ప్రొఫెసర్ లావిరి మోర్టో అభినందించి ఘనంగా సన్మానించినట్లు తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. మెమొంటోతో పాటు ప్రశంసా పత్రం అందజేశారని ఆయన పేర్కొన్నారు.

‘హైదరాబాద్‌లో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపిస్తాం’


మేఘన జైన్

అబిడ్స్: హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలతను భారీ మెజార్టీతో గెలిపించేందుకు మోదీ పరివార్ సభ్యులంతా గడపగడపకూ ప్రచారం చేస్తూ ప్రధాని నరేంద్రమోదీ సంక్షేమాన్ని వివరిస్తున్నామని మోదీ పరివార్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి మేఘన జైన్ పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రతిరోజూ ప్రతి బస్తీ, ప్రతి కాలనీ, ప్రతి మురికివాడలో పర్యటించి పదేళ్లల్లో ప్రధాని మోదీ సంక్షేమ పథకాలు అభివృద్ధి, ప్రగతిని ప్రజలకు వివరిస్తున్నామన్నారు. 40 ఏళ్లుగా హైదరాబాద్‌లో గెలుస్తూ వస్తున్న మజ్లిస్ పార్టీ కేవలం మతం పేరు చెప్పి ఓట్లు దండుకుందే తప్పా ఏనాడు చిల్లి గవ్వ అభివృద్ధి కూడా చేయలేదన్నారు. బీజేపీని గెలిపిస్తే హైదరాబాద్ దేశవ్యాప్తంగా నెంబర్ వన్ సిటీగా మారుతుందన్నారు.

‘అన్ని వర్గాల ఓటర్ల మద్దతు నాకే’

దూద్‌బౌలి: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ శనివారం పురానాపూల్, పార్థివాడ, ఎస్పీనగర్ తదితర బస్తీల్లో పాదయాత్ర నిర్వహించి ప్రచారం చేశారు. ఈ ఎన్నికల్లో తనకే ఓటు వేసి గెలిపించాలని స్థానిక ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో తనకు పోటీయే లేదన్నారు. ఇక్కడి అన్ని వర్గాల ఓటర్లు తనకు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ, పురానాపూల్ కార్పొరేటర్ సున్నం రాజ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

10న అక్షయ తృతీయ పర్ణ మహోత్సవం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని కార్వాన్ దాదావాడి జైన దేవాలయంలో ఈ నెల 10వ తేదీన అక్షయ తృతీయ పర్ణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఉపవాస దీక్షలు చేసిన దాదాపు 100 మంది జైనులు ఈ కార్యక్రమంలో తమ ఉపవాసాన్ని ముగించనున్నారు. జైన గురువు డాక్టర్ సంకిత్ మునిజీతో పాటు మరో ఇద్దరు జైన సన్యాసుల మార్గదర్శకత్వంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన 32 మందితో సహా దేశవ్యాప్తంగా నాసిక్, పూణే, జోధ్‌పూర్, కర్ణాటక, చెన్నై వంటి నగరాల నుంచి 700 మంది జైనులు పాల్గొంటారని నిర్వాహకులు ఒక ప్రకటనలో వెల్లడించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



గౌలిపురా: ఎన్నికల సందర్భంగా రౌడీషీటర్లు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఛత్రినాక డివిజన్ ఏసీపీ చంద్రశేఖర్ హెచ్చరించారు. పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు శనివారం ఆయన స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్‌తో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..ఎన్నికల సందర్భంగా రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐ శ్రీను, ఎస్సై సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

‘పదేళ్ల బీఆర్ఎస్ ప్రగతితో విజయం సాధిస్తా’



అబిడ్స్: పదేళ్ల బీఆర్ఎస్ ప్రగతితోనే సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని బీఆర్ఎస్ అభ్యర్థి టీ.పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్. ఆనంద్ కుమార్‌గౌడ్‌తో కలిసి పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. తనని గెలిపిస్తే సికింద్రాబాద్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిగుతానన్నారు. ఎంపీగా ఉన్న బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ప్రజలకు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

‘హైదరాబాద్ స్థానం కాంగ్రెస్‌దే’


కాంగ్రెస్ అభ్యర్థి వలి ఉల్లా సమీర్, చంటిబాబు తదితరులు

గోల్కొండ: హైదరాబాద్‌లో తన గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ వలి ఉల్లా సమీర్ అన్నారు. శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చంటిబాబు ఆధ్వర్యంలో లంగర్‌హౌస్‌లో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్నారన్నారు. అయితే తెలంగాణలో తాము గెలవలేమన్న నిరాశ, అక్కసుతో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్‌పై నిరాధార ఆరోపణలు, అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సత్యంరెడ్డి, వెంకటకృష్ణ, రఘుపాల్‌రెడ్డి, పరమానందం, ఏఖాన్, కురాకుల కృష్ణ, ఆబిద్ తదితరులున్నారు.

‘బీఆర్ఎస్‌కే ఓటర్ల మద్దతు’


కేసీఆర్ చిత్రపటాలతో ప్రచారం చేస్తున్న పుష్పాల రాధాకృష్ణ తదితరులు

చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఓటర్లు తమ పార్టీ అభ్యర్థి వైపే మొగ్గు చూపుతున్నారని మొఘల్‌పురా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పుష్పాల రాధాకృష్ణ అన్నారు. చార్మినార్ నియోజకవర్గంలోని పలు బస్తీల్లో ఆయన అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తరఫున శనివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఎన్నికల కరపత్రాలతో పాటు మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటాలను పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన విధంగా ఆరు గ్యారంటీలు ఫెయిల్ అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు సంతోషి, భానురేఖ, మమతా, రాజమణి, సాక్షి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి పండుగ



లంగర్‌హౌస్: బొడ్రాయి పండుగ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. లంగర్‌హౌస్‌లో బొడ్రాయి లేకపోవడంతో అనేక ఏళ్లుగా బోనాల సందర్భంగా బొడ్రాయి పెట్టాలని రంగంలో చెబుతున్నారు. గతేడాది బొడ్రాయి ఏర్పాటు చేయగా శుక్రవారం పూర్తయింది. దీంతో మాజీ కార్పొరేటర్ వినోద్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి బొడ్రాయిని ముస్తాబు చేశారు. ఇందులో భాగంగా వివిధ బస్తీల నుంచి మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నాగేంద్ర ప్రకాష్‌రెడ్డి, భోగి పరమేష్, కృష్ణయాదవ్, పాండు, సుగంధ, పుష్ప పాల్గొన్నారు.

కరాటేలో బాలికలకు ఉచిత శిక్షణ



చాంద్రాయణగుట్ట: వేసవి కాలాన్ని పురస్కరించుకొని నాయక్ బూడోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో బాలికలకు ఉచితంగా కరాటే శిక్షణ ఇస్తున్నట్లు అకాడమీ అధ్యక్షుడు ఎం.గణేష్ నాయక్ తెలిపారు. ఛత్రినాక శివగంగానగర్‌లోని మైదానంలో ప్రతిరోజే ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ప్రస్తుత సమాజంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాల నేపథ్యంలో స్వీయ రక్షణ పొందేందుకు కరాటే నేర్చుకోవడం ఎంతో దోహదపడుతుందన్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుత వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నెలాఖరు వరకు కరాటేలో ప్రాథమిక మెళకువలు నేర్పించనున్నామన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



డబీర్‌పురా: పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం స్థానిక పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. బడాబజార్ నుంచి ప్రారంభమైన ఈ ఫ్లాగ్‌మార్చ్ తలాబ్‌కట్టా, జాఫర్ రోడ్డు, చున్నేకీ బట్టీ, మౌలాకా చిల్లా, రహమత్‌నగర్ మీదుగా చోటాపూల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ..ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

గౌలిపురాలో బీఆర్ఎస్ ప్రచారం


ప్రచారాన్ని చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గౌలిపురా: హైదరాబాద్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్‌కు మద్దతుగా శనివారం గౌలిపురా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోలోజు సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ కేసీఆర్ చిత్రపటాలను అందజేస్తూ బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. హనుమాన్‌నగర్, అంబికానగర్, దానయ్యనగర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ జనరల్ సెక్రటరీ మణికొండ విజయ్ కుమార్, మహేందర్, వర్కల ఆనంద్ మోహన్, వరుణ్ పాల్గొన్నారు.

జియాగూడలో ఎమ్మెల్యే కౌసర్ పాదయాత్ర


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

జియాగూడ: హైదరాబాద్ పార్లమెంట్‌లో అసదుద్దీన్ ఒవైసీ మరోసారి అఖండ విజయం సాధిస్తారని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం జియాగూడలో పాదయాత్ర చేస్తూ ప్రచారం చేశారు. గోపీ హోటల్ చౌరస్తా నుంచి మిఠిషాబాగ్, సలీం హోటల్, పురానాపూల్, ఇక్బాల్‌గంజ్, బడాబండ్ల, మీర్ నవాబ్‌దర్గా, మాలిక్‌దానా మజీద్, లూసి హోటల్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకుడు కమల్ వార్షి, కాలియా పహిల్వాన్, సలీమ్, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా డెంటల్ ఆసుపత్రి అసోసియేషన్ అధ్యక్షుడిగా సిరాజ్ ఉర్ రెహమాన్



అబిడ్స్: ఉస్మానియా ప్రభుత్వ డెంటల్ అసోసియేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ డాక్టర్ సిరాజ్ ఉర్ రెహమాన్ ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఆసుపత్రిలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మానం చేశారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎస్.హరికృష్ణారెడ్డి, కోశాధికారిగా డాక్టర్ వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎన్.ప్రసాద్, డాక్టర్ వసుధ, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ రమేష్, డాక్టర్ అసునుద్దీన్ షేక్, డాక్టర్ రమేష్, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ శాంతిప్రియ, డాక్టర్ డోలార్ జోషి, డాక్టర్ రమ్యజ్యోతి డాక్టర్ తారా సింగ్, డాక్టర్ జ్యోతి మాయ, డాక్టర్ తులసిప్రియను ఎన్నుకున్నారు.